

## ‘మారథాన్ క్లీన్ అప్’

సిటీబ్యూరో, మే 26 ( నమస్తే తెలంగాణ ) : సామాజిక బాధ్యతలో భాగంగా ఐటీ ఉద్యోగులు, సైక్లిస్టులు నగరంలో ‘మారథాన్ క్లీన్ అప్’ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి వీకెండ్‌లో ఓ చెరువును ఎంచుకుని అక్కడ వ్యర్థాలను తొలిగిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం కాప్రా లేక్ వద్ద పరిశుభ్రత చేపట్టారు. ఈ సందర్భంగా హ్యాపీ హైదరాబాద్ సభ్యుడు రవి మాట్లాడుతూ.. చెరువుల వద్ద చేపట్టే స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సిందిగా కోరారు. మన పరిసరాలు మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.


# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 27 మే 2024 | HYDERABAD




సదస్సులో డైరెక్టర్ బీరప్ప, వైద్యులు

## అత్యవసర చికిత్సపై సదస్సు

ఖైరతాబాద్, మే 26 : అత్యవసర చికిత్సపై నిమ్స్ దవాఖానలోని ఆడిటోరియంలో ఆదివారం సదస్సు జరిగింది. అంతర్జాతీయ ట్రామా అండ్ క్రిటికల్ కేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప.. రోగి ప్రాణాలను రక్షించేందుకు అత్యవసర చికిత్స ఆవశ్యకత, వైద్యుల బాధ్యతలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్, ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ ఆశిమా శర్మ పాల్గొన్నారు.

# ఉసురు తీసిన వాన

### గాలివాన బీభత్సం..వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి

### మియాపూర్‌లో ఇటుకలు పడి ఇద్దరి దుర్మరణం

### తిమ్మాయిపల్లిలో చెట్టు కూలి మరో ఇద్దరు..



మన్సూరాబాద్ డివిజన్ ఇందిరానగర్ కాలనీలో కూలిన విద్యుత్ స్తంభం



కీసరగుట్టకు వెళ్లే రోడ్డు మార్గంలో నేలకూలిన చెట్టు

సిటీబ్యూరో:ఉపరితల ద్రోణి ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల ఆదివారం గాలి వాన బీభత్సం సృష్టించింది. నలుగురి ప్రాణాలను తీసింది. పలు ప్రాంతాల్లో చెట్లు నేల కొరిగాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్, నాగోల్, కీసర తదితర ప్రాంతాల్లో ఈదురుగాలుల ప్రభావానికి 30కి పైగా చెట్లు నేల కూలాయి. పలు చోట్ల హోర్డింగ్‌లు ఊడిపడ్డాయి. హయత్‌నగర్ పరిధిలో 30 విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తిమ్మాయిపల్లిలో చెట్టు కూలి ఇద్దరు చనిపోయారు. మియాపూర్‌లో వేర్వేరు చోట్ల ఇటుకలు మీద పడి చిన్నారితో పాటు ఓ వ్యక్తి చనిపోయాడు. ఆదివారం రాత్రి 8గంటల వరకు వనస్థలిపురంలో అత్యధికంగా 1.0సెం.మీల వర్షపాతం నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ అధికారులు వెల్లడించారు. మియాపూర్, బీహెచ్‌ఈఎల్‌లో 8.0మిల్లీ మీటర్లు, రామంతాపూర్, సరూర్‌నగర్, నాగోల్, ఉప్పల్, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో 7.0మి.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. కాగా, గ్రేటర్‌లో ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు జీహెచ్‌ఎంసీ అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ఆదివారం 14 చోట్ల ఫిర్యాదులను స్వీకరించగా, 13 ప్రాంతాల్లో సమస్యలకు పరిష్కారం చూపారు. ఎక్కువగా చెట్లు విరిగిపడటంపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. వర్షాలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా.. జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూం నం. 21111111, 9000113667, 100, ట్రాఫిక్ సమస్యలపై పోలీసుల వాట్సాప్, హాక్ ఐ లను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

### యుద్ధప్రాతిపదికన..

ఈదురు గాలులకు విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. 33కేవీ, 11కేవీ ఫీడర్లలోనూ అంతరాయం కలిగింది. కొన్ని చోట్ల ఎల్ టీ లైన్లు బాగా దెబ్బతినడంతో సరఫరా పునరుద్ధరణ ఆలస్యమైందని అధికారులు తెలిపారు.

### మరో రెండు రోజులు.. వానలు



ద్రోణి ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## చెట్టు కూలి ఇద్దరు..ఇటుకలు మీద పడి మరో ఇద్దరు..

ఈదురు గాలులతో కురిసిన వర్షానికి వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు మృతి చెందారు. యాదాద్రి జిల్లా బొమ్మల రామారం గ్రామానికి చెందిన నాగిరెడ్డి రాంరెడ్డి(56), ధనుంజయ(46) ఆదివారం ద్విచక్ర వాహనంపై శామీర్‌పేటకు బయలుదేరారు. కీసర మండలం మీదుగా వస్తుండగా, తిమ్మాయిపల్లి వద్దకు రాగానే భారీ గాలి, వాన మొదలుకావడంతో వాహనం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వారు ద్విచక్ర వాహనాన్ని ఆపి, చెట్టు కిందకు వచ్చారు. విపరీతమైన గాలిరావడంతో వారు నిల్చున్న చెట్టు ఒక్కసారి కూలి వారి మీద పడింది. ఈ ఘటనలో నాగిరెడ్డి రాంరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాగా, తీవ్రంగా గాయపడిన ధనుంజయ మార్గమధ్యలో చనిపోయాడు. ఇద్దరి మృతదేహాలను గాంధీకి తరలించారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

**మియాపూర్‌లో....**

భారీ ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేట డివిజన్ సాయినగర్‌కు చెందిన చిన్నారి సమ్మద్(3)పై పక్కింటి ఐదో అంతస్తు పై నుంచి సిమెంట్ ఇటుకలు పడటంతో తీవ్ర గాయపడి చనిపోయాడు. ఇదే ప్రాంతంలో మహ్మద్ రషీద్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, షేక్ ఖుర్షీద్‌కు చెందిన ఇంటి ప్రహరీ సిమెంట్ ఇటుకలు తలపై పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా....చికిత్స పొందుతూ మృతి చెందాడు.



సాగర్ కాంప్లెక్స్‌లో కూలిన సెల్ టవర్



# హైదరాబాద్‌లోనే ఖర్చులెక్కువ..

### మెట్రో నగరాల్లో పెరగని సామాన్యుడి సంపాదన

### ఆదాయంలో కనబడని వృద్ధి


### పిల్లల చదువులకే అధిక మొత్తం వెచ్చింపు

### ద ఇండియన్ గ్రేట్ వాలెట్ సర్వేలో వెల్లడి

### చెన్నైలో తక్కువ

సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ) : దూరపు కొండలు నునుపు అన్నట్లుగా సామాన్యుడి జీవితం మారుతోంది. ఉద్యోగ, ఉపాధి కోసం పట్నం బాటపట్టే ఎంతో మంది.. చాలీచాలనీ జీతాలతో నెట్టుకొస్తున్నారు. ఇంటి ఖర్చులు, రవాణా, విద్య, వైద్యం ఇలా రోజు వారీ ఖర్చులు గణనీయంగా పెరుగుతుండటంతో.... వచ్చే జీతం డబ్బులు ఏ మూలకు సరిపోవడం లేదు. హోమ్ క్రెడిట్ సంస్థ చేసిన ద ఇండియన్ గ్రేట్ వాలెట్ సర్వే.. మెట్రో నగరాల్లో సామాన్యుడి ఆర్థిక స్థితిగతులను వెల్లడించింది. దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో ఉండే వారి ఆదాయం, ఖర్చులు, అప్పులను పరిగణనలోకి తీసుకుని నివేదిక రూపొందించగా... ఖర్చులకు తగినట్లుగా ఆదాయంలో వృద్ధి లేదని తేలింది. ముఖ్యంగా హైదరాబాద్‌లోనే ఖర్చులు ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

### 30వేల లోబడి జీతభత్యాలపై ..



దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన మెట్రో నగరాల నివాసితుల ఆదాయ, వ్యయాలపై అధ్యయనం చేసింది. దీనిలో ప్రధానంగా 30వేల లోబడి జీతభత్యాలపై ఆధారపడిన వారి సంఖ్య 3శాతం, రూ. 30-50వేల లోపు 11శాతం, రూ. 50వేల పైబడిన వారి సంఖ్య 60 శాతం మందితో సేకరించిన వివరాల ప్రకారం అధ్యయనం చేశారు. వీరిలో స్వయం ఉపాధి, వేతనం, బిజినెస్‌పై ఆధారపడి ఉండగా, సర్వేలో పాల్గొన్న వారిలో ఎక్కువగా మగవారే ఉన్నారు. మొత్తం 10కిపైగా ప్రధాన నగరాల్లో వివరాలను సేకరించి, అధ్యయనం చేసిన ఫలితాలను హోమ్ క్రెడిట్ సంస్థ వెల్లడించింది.

### జీతంలో మిగిలేది తక్కువే..

తొలుత నెలవారీ ఆదాయ వివరాలను సేకరించగా... ఇందులో గతేడాది కాలంగా జీతభత్యాల్లో రూ. 3వేలకు మించి పెరగని వారీ సంఖ్యే ఎక్కువగా ఉంది. 2023లో రూ. 30వేల జీతం ఉంటే, ఈ ఏడాది నాటికి రూ. 33వేలు సగటున మంత్లీ ఇన్‌కం ఉందని తేల్చారు. అదే సమయంలో ఏడాదిలో పెరిగిన ఖర్చులను లెక్కిస్తే.. పెరిగిన జీతం ఏ మూలకు సరిపోవడం లేదని వెల్లడైంది. 2023లో 16వేల నెలవారీ ఖర్చులు ఉండే ఈ ఏడాది మే 1 నాటికి రూ. 19వేలకు చేరింది. ఇందులో ఇంటి అద్దె, వైద్యం, నిత్యావసర సరుకులు, నిర్వహణ పోను వచ్చే జీతంలో మిగిలేది చాలా తక్కువగానే ఉంది. ప్రధాన నగరాల్లో ఆదాయ, ఖర్చులను పోల్చితే... హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఉండటం గమనార్హం. నెలవారీ ఆదాయం రూ. 44వేలు ఉంటే ఇందులో.. రూ. 24వేల నెలవారీ నిర్వహణ ఖర్చులకు చెల్లించాల్సి వస్తుందని గుర్తించారు. నెలవారీ ఖర్చుల విషయంలో హైదరాబాద్ మిగిలిన మెట్రో నగరాల కంటే ఎక్కువగా ఉండగా... అత్యల్పంగా చెన్నయ్ నగరంలో నెలవారీ ఖర్చులు రూ. 14వేలుగా ఉంది.

### తప్పుతున్న నెలవారీ బడ్జెట్

దేశంలోని ప్రధాన మెట్రో నగరాలైన బెంగళూరు, ముంబై, చెన్నై, పుణె, ఢిల్లీ, కోల్‌కతా వంటి నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లోనే అత్యధికంగా నెలవారీ ఖర్చులు ఉంటున్నాయి. ఆ తర్వాత స్థానంలో బెంగళూరు, పుణె నగరాల్లో ఖర్చు అవుతుండగా, కోల్‌కతా, ఢిల్లీ, ముంబై నగరాలు ఉన్నాయి. ఆయా మెట్రో నగరాల్లో కనిష్ఠంగా రూ. 14వేల నుంచి రూ. 24వేల ఖర్చు చేస్తే తప్ప.. నెల గడిచే పరిస్థితి లేదని తేలింది. ఇక మెట్రోపాలిటన్ నగరాల్లో దొరికే ఉపాధి అవకాశాలతో ఎక్కువగా వలసొచ్చే నగరాల్లోనూ హైదరాబాద్ నగరానికి ప్రాధాన్యతనిస్తుండటం కూడా ఖర్చులపై ప్రభావం చూపుతుందంటున్నారు. ఆ తర్వాత బెంగళూరు నగరానికి వెళ్లేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఖర్చులు పెరగడానికి ప్రధాన కారణాల్లో విద్యా, ఇంటి అవసరాలకే ఎక్కువగా ఉన్నట్లుగా తేల్చారు. పిల్లలకు మంచి విద్యను అందించే క్రమంలో నెలవారీ బడ్జెట్ అంచనాలు తప్పుతున్నదని, విద్యా మరింత భారంగా మారుతుందని గుర్తించారు. చాలా మంది పిల్లల చదువులకే అధిక మొత్తం వెచ్చిస్తున్నట్లు వెల్లడైంది.

## ఆపరేషన్‌కు లంచమా..?

### ‘గాంధీ’ వైద్యుడి నిర్వాకం

### విచారణకు సూపరింటెండెంట్ ఆదేశం

బన్సీలాల్‌పేట్: గాంధీ దవాఖానలో శస్త్రచికిత్స చేసేందుకు రోగి నుంచి డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారంపై సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు స్పందించారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. ఖమ్మం జిల్లా, మధిరకు చెందిన ఓ రోగి మోకాలు నొప్పితో గాంధీ దవాఖానను ఆశ్రయించాడు. పరీక్షలు జరిపిన వైద్యులు.. మోకాళ్ల మార్పిడి చేయాలని సూచించడంతో చికిత్స కోసం ఆర్థోపెడిక్ విభాగంలో అడ్మిటయ్యాడు. అయితే శస్త్ర చికిత్సలో జాప్యం కావడంతో, త్వరగా ఆపరేషన్ చేయడానికి పది వేల రూపాయలు ఇవ్వాలని ఓ వైద్యుడు డిమాండ్ చేశాడని, ఆ మేరకు రోగి భార్య దవాఖాన సిబ్బందికి పది వేల రూపాయలను గూగుల్‌పే ద్వారా పంపించినట్టు తెలిసింది. ఈ విషయమై బాధితురాలు పూర్తి వివరాలతో సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న సూపరింటెండెంట్.. వైద్యుడిపై వచ్చిన ఆరోపణలపై వాస్తవాలను తెలుసుకునేందుకు నలుగురు హెచ్‌వోడీలతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. విచారణ నిర్వహించిన అనంతరం కమిటీ ఇచ్చే నివేదికను డీఎంఈకీ సీల్డ్ కవర్‌లో పంపిస్తానని సూపరింటెండెంట్ డా.రాజారావు తెలిపారు.

## శిక్షణ పూర్తి

మేడ్చల్: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన శిక్షణను పూర్తి చేశారు. మేడ్చల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు సంబంధించి బోగారంలోని హోళీ మేరి కళాశాలలో, ఎల్బీనగర్‌కు సంబంధించి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, కంటోన్మెంట్‌కు సంబంధించి బేగంపేటలోని వేస్లి కళాశాలలో లోక్‌సభతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి సంబంధించి ఓట్ల లెక్కింపు ఉంటుంది.



ఉప్పల్ శాంతినగర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

## జీవీపీ పాయింట్లపై నిఘా ఏదీ?

చెత్త రహిత నగరంగా తీర్చి దిద్దే చర్యల్లో భాగంగా తరచూ చెత్త వేసే ప్రాంతాల (గార్బేజి వనరేబుల్ పాయింట్లు/జీవీపీ)పై యాక్షన్ ప్లాన్ అటకెక్కింది. గ్రేటర్‌లో డస్ట్ బిన్‌లు ఎత్తివేసి..స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ ప్రక్రియ జరుపుతుండగా..అక్కడక్కడ కొందరు బహిరంగంగానే చెత్త వేస్తూ వస్తున్నారు. ఇలా గ్రేటర్ వ్యాప్తంగా 2640 చోట్ల చెత్త కుప్పలున్నట్లు గుర్తించారు. కానీ జీవీపీ పాయింట్ల ఎత్తివేతలోనే అధికారుల అలసత్వం ప్రదర్శిస్తుండటం, జోనల్ కమిషనర్లు సైతం ఆకస్మిక తనిఖీలు నిర్వహించకపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.

# వ్యర్థాలు తీయక..దుర్వాసన వీడక

### కంపుకొడుతున్న కాలనీలు.. రహదారులు

సిటీబ్యూరో, మే 26, (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో ‘చెత్త’శుద్ధి కరువైంది. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యం నీరుగారుతోంది. రహదారులను చెత్తాచెదారం ముంచెత్తుతోంది. ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోతుండటంతో కాలనీలు కంపుకొడుతున్నాయి. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రేటర్‌లో చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా దాదాపు మూడున్నరేండ్ల కిందట డస్ట్ బిన్ లెస్ సిటీ పేరుతో చెత్త కుండీలను జీహెచ్‌ఎంసీ ఎత్తేసింది. మెరుగైన పారిశుధ్య నిర్వహణను పకడ్బందీ చేస్తూ వందకు వంద శాతం ఇంటింటి చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోల సంఖ్యను పెంచారు. సుమారు 5250 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో 4886 కాలనీల్లో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7వేల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరగాలి. ఒక్కొక్క ఆటోకు కాలనీ వారీగా చూస్తే.. ఒకటి లేదా రెండు కాలనీలు గృహాల ప్రకారంగా గమనిస్తే.. ఒక్కొక్క అటోకు సుమారు 500 నుంచి 600 ఇండ్లను కేటాయించి, చెత్త సేకరణ జరపాలి. కానీ గడిచిన కొన్ని రోజులుగా స్వచ్ఛ ఆటోల పనితీరు సరిగా ఉండటం లేదు. చాలా కాలనీలకు రోజూ స్వచ్ఛ ఆటోలు రావడం లేదు. వందకు వంద శాతం స్వచ్ఛ ఆటోల అటెండెన్స్ ఉండటం లేదు. రోజూ వందలాది స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదని స్వయంగా కమిషనర్ రొనాల్డ్ రాస్ ఇటీవల గుర్తించారు. స్వచ్ఛ ఆటోల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించిందని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అయినా స్వచ్ఛ ఆటోల తీరు మారడం లేదు.

**నీరుగారుతున్న ఇంటింటి చెత్త సేకరణ లక్ష్యం**

**రోజూ అటెండెన్స్‌లోకి రాని వందలాది స్వచ్ఛ ఆటోలు**

**అమలుకు నోచుకోని ‘క్యూఆర్ స్కాన్’ విధానం**

**గ్రేటర్ వ్యాప్తంగా 2640 చోట్ల చెత్త కుప్పలున్నట్లు గుర్తింపు**

**రహదారులను ముంచెత్తుతున్న చెత్తాచెదారం**

### అమలు కానీ క్యూఆర్ స్కాన్..

స్వచ్ఛ ఆటోల పనితీరులో ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం వెరసి.. ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోతున్నది. సమయ పాలన పట్టించుకోకపోవడం, చెత్త సేకరణలో అధిక వసూళ్లకు తెరలేపడం, సిటీలో ఉండాల్సిన స్వచ్ఛ ఆటోలు గ్రేటర్ సరిహద్దులు దాటడం వంటి ఘటనలపై ఇప్పటికే ఫిర్యాదులు కొకొల్లలుగా వచ్చాయి. స్వచ్ఛ ఆటోలను దారిలోకి తీసుకురావడం, ఉదయం ఆటో బయలు దేరే సమయం..వ్యర్థాల సేకరణ పూర్తయ్యాక ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల వరకు వెళ్లే వరకు ‘క్యూ ఆర్’ స్కాన్ విధానాన్ని పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. శానిటేషన్‌కు సంబంధించిన విభాగంలో ఏఎంహెచ్ఓలు, ఇంజినీరింగ్, ఎంటమాలజీ సిబ్బంది, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్లు ఉన్నా.. సమన్వయ లోపంతో పారిశుధ్యం అటకెక్కుతున్నదని, పర్యవేక్షణలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ నిర్లక్ష్యం ఉందన్న ఆరోపణలు లేకపోలేదు. ముఖ్యంగా వంద రోజుల కార్యాచరణకు అధికారుల కోసం ‘ మై జీహెచ్‌ఎంసీ ’యాప్‌ను అందుబాటులోకి తీసుకురాగా, పూర్తి స్థాయి వినియోగంలో ఉన్నతాధికారులు చేతులెత్తేయడంతో నగరంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. తద్వారా నగర వీధులు ముక్కుపుటాలదిరే దుర్వాసనతో పాటు దోమల స్వైర విహారం ఎక్కువగా ఉందని స్థానిక ప్రజలు చెబుతున్నారు.

### జంతువులను ప్రేమించండి



జంతువులపై మనుషులు ప్రేమను ప్రదర్శించాలని పిలుపునిస్తూ జంతు ప్రేమికురాలు స్టెల్లా నేతృత్వంలో పలువురు జలవిహార్ వద్ద గల డాగ్ పార్కులో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. రహమత్‌నగర్‌లో జరిగిన ఘటనను గుర్తు చేసుకుంటూ.. జంతువులు, మనుషులపై అమానుష దాడులు మానుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాలక ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. - ఖైరతాబాద్, మే 26